క్లుప్తంగా

ఆలయాల్లో జీయర్ స్వామి పూజలు

ఆత్రేయపురం: వాడపల్లి వేంకటేశ్వరస్వామి, ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి ఆలయాల్లో సోమవారం భీమవరం పరమహంస పరివ్రాజకాచార్యులు, అనంత విభూషితులు, భాష్యకార సిద్ధాంత పీఠాధిపతులు జీయర్‌స్వామి ప్రత్యేక పూజలు చేశారు. ఆయా ఆలయాల వద్ద అర్చకులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆయా ఆలయాల వద్ద ఆలయ కమిటీ చైర్మన్లు, ఈవోలు స్వామి చిత్రపటం, శేషవస్త్రాలతో సత్కరించారు.

ఘనంగా లక్షతులసి పూజ



ప్రత్యేక అలంకరణలో గోపాలస్వామి

ఆత్రేయపురం: పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి జగన్మోహినీ కేశవ స్వామి క్షేత్రపాలకుడు గోపాలస్వామి ఆలయంలో సోమవారం స్వామి వారి లక్షతులసి పూజ కనుల పండువగా జరిగింది. ఉదయం స్వామికి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, మండపారాధన, కలశపూజ, విశేష అభిషేకం, బాలభోగం, తులసిపూజ, గోపూజ, శాంతి హోమం, కల్యాణం తదితర పూజలను ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ ఈవో బి.కృష్ణ చైతన్య ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.

సహజమైన కూరగాయలు పండించాలి

అంబాజీపేట: ఎటువంటి రసాయన ఎరువులు ఉపయోగించకుండా ప్రకృతి సహజ సిద్ధమైన కూరగాయలను పండించేందుకు రైతులు ఆసక్తి చూపించాలని ఎస్ఎఫ్ఎ శ్రీకాంత్, పీఆర్వో జె.నాగవేణి వివరించారు. ముక్కామలలో ఐసీఆర్పీ కె.మల్లేశ్వరి భూమిలో ప్రకృతి పద్ధతిలో ఫార్మాకల్చర్ మోడల్ కిచెన్ గార్డెన్‌పై సోమవారం రైతులకు అవగాహన కల్పించారు. కూరగాయల్లో దుంప జాతి, తీగ జాతిని సాగు చేయాలన్నారు. కార్యక్రమంలో ట్రైనర్స్ సీహెచ్ వీణ, కె.అఖిల చాందిని తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో వైఫల్యం

మామిడికుదురు: ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, టీడీపీ నేత రెడ్డి సుబ్రహ్మణ్యం ఆందోళన వ్యక్తం చేశారు. ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం సోమవారం బి.దొడ్డవరంలో జరిగింది. దీనిలో భాగంగా అక్కడ జరిగిన రచ్చబండలో నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వెలిచేరులో గడప గడపకూ..

ఆత్రేయపురం: మండలంలోని వెలిచేరులో మంగళవారం సాయంత్రం 4 గంటలకు గడప గడపకూ వైఎస్సార్ సీపీ కార్యక్రమం జరుగుతుందని మండల పార్టీ కన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజు తెలిపారు. నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

పాదయాత్రకు గుర్తుగా వేడుక

అయినవిల్లి: జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప యాత్ర చేపట్టి నాలుగు సంవత్సరాలు పూర్తైన సందర్భంగా స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు వేడుకలు జరిపారు. తొలుత ముక్తేశ్వరం సెంటర్‌లో మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

ఆధార్ అనుసంధానం చేయాలి

ఆలమూరు: జాబ్‌కార్డులు కలిగిన ఉపాధి కూలీలకు ఆధార్‌తో అనుసంధానం చేసి తగిన ప్రయోజనాలను కల్పించాలని ఏపీడీ సత్యనారాయణ తెలిపారు. ఆలమూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ అధ్యక్షతన ఎన్ఆర్‌జీఈఎస్ లేబర్ బడ్జెట్‌పై సమీక్ష జరిగింది. మార్చి 2023 నాటికి చేపట్టవలసిన పనులు, ఇప్పటికే పూర్తయిన పనులను ఫీల్డ్ అసిస్టెంట్లను అడిగి తెలుసుకున్నారు. ఇన్‌చార్జి ఏపీఓ ప్రసాద్, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కాపునాడు జాతీయ ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్

అయినవిల్లి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాపునాడు జాతీయ ఉపాధ్యక్షుడిగా మండలంలోని కె.జగన్నాథపురానికి చెందిన గంగుమళ్ళ శ్రీనివాస్‌ను నియమించినట్లు సోమవారం ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం యానాంలోని హోటల్ ఆనంద్ రీజెన్సీలో ఏపీ రాష్ట్ర కాపునాడు అధ్యక్షుడు పురంశెట్టి మంగారావు ఆధ్వర్యంలో జరిగిన జూమ్ సమావేశంలో తనను నియమించినట్లు తెలిపారు. జీఎంసీ బాలయోగి చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రజలకు పలు సేవలందించినందుకు గుర్తుగా ఈ పదవిలో నియమించినట్లు తెలిపారు. ఆయన్ను పలువురు ఈ సందర్భంగా అభినందించారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ

అయినవిల్లి: మండలంలోని తొత్తరమూడిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు స్థానిక ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు సోమవారం భూమి పూజ చేశారు. ఈ నిధులు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇచ్చిన నిధులు రూ.5 లక్షలతో నిర్మిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ వార జయసావిత్రి, వైఎస్సార్ సీపీ నాయకులు రమణాతి రాంబాబు తదితరులు ఉన్నారు.

పథకాల అమలులో జవాబుదారీగా ప్రభుత్వం



పుల్లేటికుర్రులో లబ్ధిదారులకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు



కరవాకలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరప్రసాదరావు



పొడగట్లపల్లిలో లబ్ధిదారులకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

- పుల్లేటికుర్రు, కరవాక, పొడగట్లపల్లిల్లో గడపగడపకూ..
- పాల్గొన్న ఎమ్మెల్యేలు చిట్టిబాబు, వరప్రసాదరావు, జగ్గిరెడ్డి

అంబాజీపేట: సంక్షేమ పథకాల అమలులో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీతనంగా వ్యవహరిస్తోందని ఎమ్మెల్యే చిట్టిబాబు అన్నారు. పుల్లేటికుర్రులో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఎమ్మెల్యే చిట్టిబాబు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. స్థానిక సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. ఆయా కుటుంబాలకు గడిచిన మూడేళ్లలో చేకూరిన లబ్ధితో రూపొందించిన సంక్షేమ బ్రోచర్లను లబ్ధిదారులకు అందజేశారు. ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటిని 98 శాతం నెరవేర్చిన ఏకైక సీఎం జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాల్ని చేరువ చేశారన్నారు. గత ప్రభుత్వంలో కొన్ని వర్గాలకు, టీడీపీ మెప్పు పొందిన వారికి పథకాలు ఇచ్చారని విమర్శించారు. ప్రతిపక్షాల బురద రాజకీయాల్ని ప్రజలే తిప్పికొట్టాలని, ప్రభుత్వానికి బాసటగా నిలవాలని కోరారు. స్థానికంగా నెలకొన్న సమస్యలపై ఆయా శాఖల అధికారులతో అక్కడికక్కడే చర్చించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, సొసైటీ అధ్యక్షులు నీతిపూడి వెంకటరమణ, కొర్లపాటి కోటబాబు, ఎంపీటీసీలు కుసుమ వెంకటేష్, వడలి కష్ణమూర్తి, నందుల ఆదినారాయణ, అందె వెంకటముక్తేశ్వరరావు, వాసంశెట్టి చినబాబు, నాగవరపు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే జగనన్న లక్ష్యం

పేదలకు పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడమే సీఎం జగన్ లక్ష్యమని ఎమ్మెల్యే చిట్టిబాబు అన్నారు. పుల్లేటికుర్రులో ప్రజా సంకల్పయాత్ర ప్రారంభించి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పాదయాత్రలో ఇచ్చిన హామీలే కాకుండా ప్రజలకు ఆర్థిక పురోభివృద్ధి చెందేలా మరెన్నో సంక్షేమ పథకాలు అందిచారన్నారు. ప్రతి గ్రామంలో విలేజ్ క్లినిక్‌లు, ఫ్యామిలీ ఫిజీషియన్ వంటి మహోత్తర పథకాలను ప్రవేశపెట్టారన్నారు. అంతకుముందు వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పాదయాత్ర నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా కేకు కట్‌చేసి అభిమానులకు పంచారు.

జగన్ పాలన చూసి ఓటెయ్యండి: ఎమ్మెల్యే వరప్రసాదరావు

మామిడికుదురు: అభివృద్ధితో పాటు సంక్షేమమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డి పాలనను చూసి ఓటెయ్యాలని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు కోరారు. గడప గడపకూ కార్యక్రమం సోమవారం కరవాకలో జరిగింది. వరప్రసాదరావు ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అమలు జరుగుతున్న తీరును ప్రజలు పొందుతున్న ఆర్థిక సహాయాన్ని గణాంకాలతో సహా వివరించారు. ఏ ఒక్క వర్గానికి అన్యాయం జరగకుండా సంక్షేమ పథకాలను పరుగులు పెట్టిస్తున్నారన్నారు. ఏ ఒక్కరినీ పలకరించినా నాలుగైదు పథకాలు అందుకున్న వారే కనిపిస్తారని చెప్పారు. ప్రజలకిచ్చిన హామీలను అమలు చేస్తూ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్న జగన్‌కు ప్రజలు బాసటగా నిలవాలన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా నేరుగా లబ్ధిదారుల ఇంటికే వెళ్లి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని చెప్పారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా పాలనకు కొత్త నిర్వచనం తీసుకువచ్చారన్నారు. వైఎస్ జగన్ చేపట్టిన ప్రజా సంకల్ప పాదయాత్ర నాలుగేళ్లు పూర్తైన సందర్భంగా కరవాకలోని రైతు భరోసా కేంద్రం వద్ద ఎమ్మెల్యే వరప్రసాదరావు కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు పంచారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు జై జగన్... జైజై జగన్ నినాదాలతో హోరెత్తించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు బొలిశెట్టి భగవాన్, సర్పంచ్ రేకాడి సత్యనారాయణ, ఎంపీటీసీ మల్లాడి వడ్డికాసులు, గ్రామశాఖ అధ్యక్షుడు సందాడి పార్థీశ్వరవర్మ, మాజీ సర్పంచ్ సిర్రా శ్రీనివాసరావు, నాయకులు ఎండీవై షరీఫ్, సందాడి ఏసుబాబు, అంగాని సుబ్బారావు, కుసుమ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేయడమే లక్ష్యం: ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

రావులపాలెం: అర్హులైన అందరికీ సంక్షేమ పథకాలు అందజేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని పొడగట్లపల్లి సచివాలయం-1, 2 పరిధిలోని అగ్రహారం, వినాయక పాలెం, లక్ష్మీపాలెం తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి గడప గడపకూ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వారికి అందిన సంక్షేమాన్ని వివరించడంతో పాటు సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సర్పంచ్ గంధం దేవి, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు గంధం అన్నవరం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు హాజరయ్యారు. ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ ఎమ్మెల్యే సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అలాగే వారికి అందిన ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరిస్తూ వారికి పత్రాలను అందజేశారు. జగ్గిరెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ అందిస్తున్న సంక్షేమం, అభివృద్ధిని చూసి మరలా ఎన్నికల్లో మరోమారు ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కలిగినీడి సత్యవతి, ఉప సర్పంచ్ ఎస్.సత్యవేణి, పీఏసీఎస్ అధ్యక్షుడు బి.సత్యనారాయణరాజు, కొప్పెల్ల మల్లి, పార్టీ నాయకులు పమ్మి చంటి, సంపత్‌రావు, తోట కూర సత్యనారాయణ, ఎంపీడీ ఓ రాజేంద్రప్రసాద్, సెక్రటరీ ఎస్.బ్రహ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి ప్రభల ఉత్సవంపై కమిటీలతో సమీక్ష



కొత్తపేట సంక్రాంతి ఉత్సవ కమిటీలు, శాంతి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ రమణ

కొత్తపేట: ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రాముఖ్యత సంతరించుకున్న కొత్తపేట సంక్రాంతి ప్రభల ఉత్సవాన్ని కుల, మత, రాజకీయాలకు అతీతంగా, పోలీసులు, వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో ప్రశాంతంగా జరుపుకోవాలని కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ సూచించారు. ఉభయగోదావరి జిల్లాల్లో కనుమ నాడు ప్రభల ఉత్సవాలకు భిన్నంగా కొత్తపేటలో అనాదిగా మకర సంక్రాంతి నాడు ప్రభల ఉత్సవాలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఆ మేరకు ఈ నెల 15న జరిగే సంక్రాంతి ప్రభల ఉత్సవాలు నిర్వహణపై సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉత్సవ కమిటీలు, శాంతి కమిటీతో పోలీసులు సమీక్షించారు. స్థానిక ఎస్సై వి.మణికుమార్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి ఎంపీపీ మార్గన గంగాధరరావు అధ్యక్షత వహించగా డీఎస్పీ మాధవరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఉత్సవ కమిటీల తరపున కొత్తరామాలయం ఉత్సవ కమిటీ ప్రెసిడెంట్, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ ముత్యాల వీరభద్రరావు మాట్లాడుతూ ఇక్కడ పాత, కొత్త రామాలయం, వీధుల పేరుతో ఉత్సవాలు జరుగుతాయని, 24 గంటల పాటు శ్రవణానందం, నయనానందకరంగా సాగే కార్యక్రమాలను వివరించారు. ఎక్కడా అశ్లీలతకు అవకాశం లేని సాంస్కృతిక కార్యక్రమాలకు అధికారులు సహకరించాలని కోరారు. మరో నాయకుడు గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ గంగాధరరావు మాట్లాడుతూ కుల, మత, వర్గాలకు అతీతంగా అందరూ తిలకించి, ఆనందించే ఈ ప్రభల ఉత్సవం అనాదిగా వివాదరహితంగా సాగుతుందన్నారు. పోలీసు వారు ఉత్సవానికి సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. డీఎస్పీ రమణ మాట్లాడుతూ ఇతర ప్రాంతాల్లో ప్రభల ఉత్సవాలకు భిన్నంగా కొత్తపేటలో భారీ స్థాయిలో జరిగే ప్రభల ఉత్సవానికి ప్రత్యేక స్థానం, గొప్ప పేరు ఉందన్న విషయాన్ని ఇప్పటికే తెలుసుకున్నానని, సంస్కృతీ, సంప్రదాయాలను, అందరి మనోభావాలను గౌరవించాలని అన్నారు. అయితే సంప్రదాయబద్ధమైన ఈ ఉత్సవాల్లో ప్రదర్శనలు ఎక్కడా శ్రుతిమించకుండా కమిటీలు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, కమిటీలు, ఉత్సవాన్ని తిలకించేందుకు వచ్చే ప్రజలు అన్ని జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు గూడపాటి రమాదేవి, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి లక్ష్మీపతిరావు, అవిడి సర్పంచ్ రెడ్డి చంటి, తహసీల్దార్ జీడీ కిషోర్‌బాబు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ ముసునూరి వెంకటేశ్వరరావు, పర్సన్ దంగేటి సుబ్రహ్మణ్యం, స్థానిక ఉప సర్పంచ్ కంఠంశెట్టి శ్రీనివాసరావు, వీడీసీ కన్వీనర్లు కుడుపూడి వెంకటేశ్వరరావు, దూనబోయిన శ్రీనివాసరావు, సాదు చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు పోషకాహార కిట్ల పంపిణీ

కొత్తపేట: గర్భిణులపై స్థానిక సత్యసాయి సేవా సంస్థ దృక్పథం అభినందనీయమని ఎంపీపీ మార్గన గంగాధరరావు అన్నారు. ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ పథకం కింద గర్భిణులకు ప్రతి నెలా తొమ్మిదో తేదీన వివిధ పరీక్షలు నిర్వహిస్తారు. దానిలో భాగంగా స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో సోమవారం సుమారు 60 మంది గర్భిణులకు వైద్యులు వివిధ పరీక్షలు నిర్వహించి, మందులు ఇవ్వడంతో పాటు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రతి నెలా ఈ పరీక్షల నిమిత్తం ఆస్పత్రికి వచ్చే గర్భిణులకు స్థానిక సత్యసాయి సేవా సమితి కన్వీనర్ కంకటాల సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో పోషకాహార కిట్లను పంపిణీ చేస్తారు. ఆ మేరకు ఎంపీపీ మార్గన గంగాధరరావు చేతుల మీదుగా సత్యసాయి సంస్థ సమకూర్చిన కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా వైఎస్సార్ సీపీ నాయకుడు బండారు కృష్ణమూర్తి, వైద్యాధికారి మధుకర్, సేవా సమితి సభ్యులు మారిశెట్టి సత్యనారాయణ, చింతం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం



పి.గన్నవరంలో ఆరోగ్యశ్రీ సేవల డెస్కును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

పి.గన్నవరం: ప్రభుత్వాస్పత్రుల ద్వారా పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రూ.వేల కోట్లు వెచ్చిస్తున్నారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. సోమవారం జరిగిన స్థానిక సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆస్పత్రి అభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పనకు, ఖాళీ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు. ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన ఆరోగ్యశ్రీ సేవల డెస్క్‌ను చిట్టిబాబు ప్రారంభించారు. కార్యక్రమాల్లో పార్టీ మండలశాఖ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, సర్పంచ్ నూకపెయ్యి ప్రసన్నకుమార్, పార్టీ నాయకులు సాధనాల రమేష్, దొమ్మేటి దుర్గారావు, పందిరి పూర్ణచంద్రరావు, కొల్లు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ ఆంధ్రా యూత్ సేవలు అభినందనీయం



రామేశ్వరంలో సత్యనారాయణకు సాయం అందిస్తున్న ఎమ్మెల్యే రాపాక

సఖినేటిపల్లి: కువైట్ కేంద్రంగా ఉన్న ఆదర్శ ఆంధ్రాయూత్ సేవలు అభినందనీయమని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. సోమవారం రామేశ్వరంలో అనారోగ్యంతో బాధపడుతున్న కె.సత్యనారాయణకు, ఆదర్శ ఆంధ్రాయూత్ తరఫున పంపిన రూ.10 వేల ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్యే అందజేశారు. సత్యనారాయణ అనారోగ్య పరిస్థితిని తెలుసుకున్న నల్లి రాజ్‌కుమార్ ఈ విషయాన్ని ఆదర్శ ఆంధ్రాయూత్ (కువైట్) అధ్యక్షుడు ఇంజేటి శ్యాంబాబు దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో సంస్థ కార్యవర్గంతో చర్చించి పై మొత్తాన్ని పంపారు. జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, సర్పంచ్ కట్టా ఉమా మహేశ్వరరావు, మాజీ సర్పంచ్ సరెళ్ల విజయ్ ప్రసాద్, ఆదర్శ ఆంధ్రాయూత్-కువైట్ సామాజిక సంఘం అధ్యక్షుడు ఇంజేటి కృష్ణకుమార్, స్థానికులు ఇంజేటి చిట్టిబాబు, తాడి సహదేవ్ పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన ఆర్యవైశ్య నూతన కార్యవర్గం

రాజోలు: రాజోలు ఆర్యవైశ్య నూతన కార్యవర్గం సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో జరిగిన సర్వ సభ్య సమావేశంలో సంఘ నూతన అధ్యక్షుడిగా కాసు శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా కొత్త శ్రీనివాసరావు, రాజా నాగరత్నకుమార్, పట్నాల దత్తాత్రేయ, కార్యదర్శిగా కాసు శ్రీనివాస రంగనాయకమూర్తి, కోశాధికారిగా చలువాది త్రినాథ్, సంయుక్త కార్యదర్శిగా కాసు సతీష్, సంయుక్త కోశాధికారిగా కోదాటి సోమరాజు, కార్యవర్గ సభ్యులుగా గ్రంధి కాశీ, లక్కంశెట్టి బాబ్జి, బాలాజీ, నార్కెడిమిల్లి కనకరాజు, గెల్లి నాగ రాజారావు ఎన్నికయ్యారు. నూతనంగా నిర్మించిన కల్యాణ మండపాన్ని వచ్చే నెల ఒకటిన ప్రారంభించేందుకు సమావేశంలో నిర్ణయిస్తూ తీర్మానం చేశారు.

స్పందనలో వివాహిత అర్జీపై పోలీసుల కేసు

సఖినేటిపల్లి: స్పందనలో సోమవారం మండలంలోని కేశవదాసుపాలేనికి చెందిన వివాహిత సాగి రెడ్డి పూర్ణ భర్తపై ఇచ్చిన అర్జీ ఆధారంగా సఖినేటిపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలను ఎస్సై అడపా ఫణిమోహన్ తెలిపారు. సాగి రెడ్డి పూర్ణను ఏడాదిగా భర్త సత్యనారాయణ, అత్తంటివారు పలు విధాలుగా ఇబ్బందులు పెడుతున్నారంటూ గతంలో ఆమె చేసిన ఫిర్యాదు మేరకు వారికి కౌన్సెలింగ్ ఇచ్చి పంపామన్నారు. అయితే భార్యను బాగా చూసుకుంటామని చెప్పిన సత్యనారాయణ, ఇటీవల తల్లితో కలిసి, భార్య పూర్ణతో చెప్పపెట్టకుండా హైదరాబాద్ వెళ్లిపోయినట్టు చెప్పారు. తాను తన కొడుకుతో కలసి తల్లి వద్ద ఉంటున్నట్టు, మంచి చెడ్డలు చూడకుండా విడిచి భర్త వెళ్లిన విషయంలో తగిన న్యాయం చేయాలని అర్జీలో కోరినట్టు ఎస్సై అన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు కూడా చెప్పారు.

100 లీటర్ల సారా స్వాధీనం

ఆలమూరు: మండలంలోని జొన్నాడ ఏటిగట్టుపై స్కూటర్‌పై 100 లీటర్ల సారా తరలిస్తున్న కోమలి దుర్గాప్రసాద్‌ను ఆలమూరు పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక ఎస్సై ఎస్.శివప్రసాద్ కథనం ప్రకారం సారా తరలిస్తున్నారనే పక్కా సమాచారంతో సోమవారం సాయంకాలం ఏటిగట్టుపై పోలీసులు మాటు వేశారు. సారా తరలిస్తున్న దుర్గా ప్రసాద్‌ను అదుపులోకి తీసుకుని అతడు నడుపుతున్న స్కూటర్‌ను సీజ్ చేశారు. ఈ మేరకు ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు

రాజోలు: సంక్రాంతికి స్వాగతం పలుకుతూ రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా.. ఉల్లాసంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. సోమవారం కళాశాల ఆవరణలో ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు ప్రారంభించారు. కళాశాల విద్యార్థినులు, విద్యార్థులు తెలుగు సంప్రదాయ దుస్తులు ధరించి ఆకట్టుకున్నారు. క్రికెట్, కబడ్డీ పోటీలను నిర్వహించారు. కళాశాల విద్యార్థినులకు వంటల పోటీలు నిర్వహించగా వంటకాలను ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు రుచి చూసి విద్యార్థినులను అభినందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముందస్తుగా కళాశాలలో సంక్రాంతి పండగ వాతావరణం తీసుకువచ్చారని అధ్యాపకులను అభినందించారు. తెలుగు పండగలు, ఆచారాలు, సంప్రదాయాలను విద్యార్థులకు నేర్పించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ పి.సాయిబాబు, జెడ్పీటీసీ మట్టా శైలజ, రాజోలు, సోంపల్లి సర్పంచ్‌లు రేవు జ్యోతి, కట్టా శ్రీనివాసరావు, దార్ల పెదబాబు, మట్టా ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

మాతృ, శిశు మరణాల నివారణే లక్ష్యం

ఆలమూరు: మాతృత్వ, శిశు మరణాల నివారణకు, చిన్నారుల మెరుగైన ఆరోగ్య సంరక్షణను కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ (పీఎంఎంఎస్ఏ) పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని చొప్పెల్ల, పెదపళ్ల వైద్యాధికారులు ఎం.సుమలత, ఆర్.సుదర్శన్‌బాబు, పి.భవానీశంకర్ అన్నారు. పీఎంఎంఎస్ఏ పథకంలో భాగంగా సోమవారం సుమారు 142 మంది బాలింతలు, గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో బాలింతలు, గర్భిణులకు అందిస్తున్న సేవలు, తీసుకోవలసిన జాగ్రత్తలను ఆరోగ్య, అంగన్‌వాడీ, ఆశ సిబ్బంది వివరించారు. ప్రతినెలా క్రమం తప్పకుండా తొమ్మిదిన బాలింతలు, గర్భిణులకు నిర్వహిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారులు సూచించారు. సీహెచ్ఓ పి.వెంకటరత్నం, హెల్త్ ఎడ్యుకేటర్ ఏవీవీ రాజా, సూపర్‌వైజర్లు పీవీ రమణారావు, ఎన్.వెంకటేశ్వర్లు, పి.ఉమ, సీహెచ్ బేబి, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

యువతి కిడ్నాప్‌పై కేసు

అయినవిల్లి: ఓ యువతి కిడ్నాప్‌పై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్.నాగేశ్వరరావు తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. అయినవిల్లి మండలం వీరవల్లిపాలేనికి చెందిన పదహారు సంవత్సరాల యువతిని రాజమహేంద్రవరానికి చెందిన అన్నెంరాజు కిడ్నాప్ చేసినట్లు యువతి తాతయ్య అయినవిల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

పాక్షికంగా ప్రార్థనా మందిరం దగ్ధం

అంబాజీపేట: గంగలకుర్రు అగ్రహారం శివారు ప్రభాకర్ నగర్ కాలనీలో ఉన్న రేమ బ్లెసింగ్ చర్చికి సోమవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. రేకుల షెడ్డుతో ఉన్న ఈ చర్చికి ప్రహరీగా క్లాత్ చుట్టారు. దానికి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించడంతో స్థానికులు గుర్తించి మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో చర్చి క్లాత్ పాక్షికంగాను, కుర్చీలు కాలిబూడిదయ్యాయి. సంఘటనా స్థలాన్ని సీఐ డి.ప్రశాంత్‌కుమార్, ఎస్సై కె.చైతన్యకుమార్‌లు పరిశీలించారు. చర్చి సంఘస్తులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సర్పంచ్‌పై దాడి ఘటనలో ముగ్గురిపై కేసు

సఖినేటిపల్లి: అంతర్వేది దేవస్థానం సర్పంచ్ కొండా జాన్ బాబుపై ఆదివారం జరిగిన దాడి ఘటనకు సంబంధించి అదే గ్రామానికి చెందిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై అడపా ఫణి మోహన్ సోమవారం చెప్పారు. గ్రామానికి సంబంధించిన ఒక విషయమై సమావేశం జరుగుతుండగా ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో సర్పంచ్‌పై గుర్రం ప్రవీణ్, గుర్రం దాసు, కె.రఫీక్ దాడి చేసినట్టు ఆయన తెలిపారు. దాడిలో గాయపడిన సర్పంచ్‌ను 108లో రాజోలు ప్రభుత్వాస్పత్రికి స్థానికులు తీసుకువెళ్లారు. ఆస్పత్రి వర్గాలకు సర్పంచ్ ఇచ్చిన సమాచారం మేరకు, ఆయన ఫిర్యాదుపై దాడికి పాల్పడిన ముగ్గురుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై చెప్పారు.

వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మృతి



జగతా అరుణాచల నాయుడు (ఫైల్)

మామిడికుదురు: పాశర్లపూడిబాడవకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ జగతా అరుణాచలనాయుడు (55) గుండెపోటుతో మృతి చెందారు. ఆదివారం రాత్రి గుండెపోటుకు గురైన అరుణాచలనాయుడును పేరూరు జంక్షన్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె సంతానం. అతని అంత్యక్రియలు సోమవారం స్థానిక శ్మశానవాటికలో నిర్వహించారు. అరుణాచలనాయుడు మృతదేహానికి ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, పీఏసీఎస్ చైర్మన్ కటకంశెట్టి ఆదిత్యకుమార్, పార్టీ నాయకులు నివాళులర్పించారు.

బీమా సొమ్ము అందజేత

ఆలమూరు: మండలంలోని చెముడులంకలో ఇటీవల మృతి చెందిన జల్లూరి జగ్గారావు కుటుంబానికి వైఎస్సార్ బీమా చెక్కు పంపిణీ జరిగింది. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద మృతుడు భార్య దుర్గకు నగదు రూపంలో సర్పంచ్ తమ్మన శ్రీనివాసు అందజేశారు. పేద కుటుంబాలకు వైఎస్సార్ బీమా ఎంతో ఆసరాగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు దొండపాటి వెంకటేశ్వరరావు, దొండపాటి చంటి, మాజీ సర్పంచ్‌లు నాగిరెడ్డి సత్యనారాయణ, బుడ్డిగ వీర వెంకట్రావు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

పి.గన్నవరం: ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పి.గన్నవరం సీహెచ్‌సీలో సోమవారం వైద్యాధికారుల ఆధ్వర్యంలో గర్భిణులకు ప్రత్యేక వైద్య సేవలు అందించారు. వై.కొత్తపల్లికి చెందిన వేణి ఫౌండేషన్ చైర్మన్ నల్లా గంగా ఈశ్వరరావు, సభ్యులు తిక్కిరెడ్డి శ్రీనివాస్, లక్ష్మీ భవానిల ఆధ్వర్యంలో పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ జీవీ సురేష్, ఎస్సై పి.గంగాభవాని, నల్లా పెదకాపు, తోలేటి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. అలాగే నాగుల్లంక పీహెచ్‌సీలో వైద్యాధికారి కె.సుబ్బరాజు ఆధ్వర్యంలో సోమవారం 41 మందికి వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. గర్భిణులు జాగ్రత్తలు పాటించాలని సుబ్బరాజు సూచించారు. పాలకొల్లు బోళ్ల వీరాస్వామి సత్రం ఆధ్వర్యంలో గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు. సీహెచ్ఓ ఎం.రవికుమార్, ఎంపీహెచ్ఓ ఎ.నాగరాజు, ఎంపీహెచ్ఎస్‌లు బీవీవీఎస్ఎన్ మూర్తి, ఎన్వీ రంగనాథ్, మేరీరత్నం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్రైస్తవుల అభ్యున్నతికి సీఎం కృషి ప్రశంసనీయం

సఖినేటిపల్లి: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి క్రైస్తవులకు చేస్తున్న పనులు, సేవలు ప్రశంసనీయమని ఏపీ రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ బొల్లవరపు జాన్‌వెస్లీ అన్నారు. ఆదివారం రాత్రి సఖినేటిపల్లిలో శాంతి సదన్ ప్రాంగణంలో సదరు సంస్థ 50వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. వేడుకలను శాంతి సదన్ వ్యవస్థాపకుడు, డైరెక్టర్ బిషప్ ఈద శిరీష జాషువా ఆధ్వర్యాన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో శాంతి సదన్ నిర్వహిస్తున్న 19 విభాగాల్లో గత 50 సంవత్సరాలుగా ఉపాధి, సహాయం పొందిన వారంతా వార్షికోత్సవ గ్రీటింగ్స్ తెలిపారు. అనంతరం సంస్థలోని బాలబాలికలకు, యువకులకు, స్త్రీలకు, దుస్తులను పంపిణీ చేశారు. ముఖ్యఅతిథి జాన్ వెస్లీని, బిషప్ శిరీష జాషువా సత్కరించి జ్ఞాపిక అందజేశారు. బిషప్ శ్రవణ్‌కుమార్, బిషప్ శరత్‌భూషణ్, శశిభూషణ్, క్రైస్తవులు పాల్గొన్నారు.

త్యాగరాజ ఆరాధనోత్సవాలు ప్రారంభం



ముంగండలో జరిగిన గాత్రయుగళ సంగీత సభ

పి.గన్నవరం: సంగీత జగద్గురు త్యాగరాజ స్వామి 47వ ఆరాధనోత్సవాలు ముంగండలోని త్యాగరాజ స్వామి ఆరాధన సమితి ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం త్యాగరాజ స్వామి, శ్రీరామచంద్రమూర్తులకు భక్తులు సహస్ర నామ పూజలు చేశారు. రాత్రి మల్లాది శ్రీరామ్‌ప్రసాద్, రవికుమార్, మావుదూరి సత్యనారాయణ శర్మ, బీవీఎస్ ప్రసాద్, సరస్వతుల హనుమంత రావులచే 'గాత్ర యుగళ సంగీత సభ' జరిగింది. కార్యక్రమాలకు ఆరాధన సమితి అధ్యక్షుడు ఇండవిల్లి నాగేశ్వరరావు, కార్యదర్శి నడిమింటి నాగరాజారావు, పెన్నింటి రామచంద్ర శాస్త్రి, ముక్కామల వెంకటశాస్త్రి, గొడవర్తి హేమలత, పి.వెంకట కృష్ణ తదితరులు ఆధ్వర్యం వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.